క్లుప్తంగా

నేడు సామూహిక వరలక్ష్మి వ్రతాలు

పెద్దాపురం: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా ఈ నెల 8న పలు దేవాలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖాధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మరిడమ్మ ఆలయం, శృంగార వల్లభుని ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఈఓలు రామ్మోహనరావు, పులి నారాయణమూర్తి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు.

మానవాళికి మార్గదర్శి క్రీస్తు



ఉపవాస కూడికకు హాజరైన విశ్వాసులు

పెద్దాపురం: మండలంలోని తిరుపతి క్రీస్తు శాంతి ప్రార్థన మందిరంలో రెవరెండ్ నంగిన సత్యానందం ఆధ్వర్యంలో మూడు రోజుల ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. సీజీఎం వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన ఈ కూడికల్లో దైవజనులు కె.అభిషేక్, జయకుమార్ మాట్లాడుతూ సర్వ మానవాళికి మార్గదర్శి ఏసుక్రీస్తు అని పేర్కొన్నారు. పాస్టర్ ఆనంద్‌కుమార్ ఆలపించిన క్రైస్తవ భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. సీజీఎం బృందం, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ శివారు కొనపాపపేటకు చెందిన ఉప్పాడ బంగారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా గురువారం అతని కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10 వేలను మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు అందించారు. పొన్నాడ ఉప సర్పంచ్ కారే ఉదయ కిరణ్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీయూ సమావేశం

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం మండల ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో నాలుగు మండలాల ఎస్టీయూ ఎగ్జిక్యూటివ్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టీయూ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి, పిఠాపురం, కిర్లంపూడి, గొల్లప్రోలు మండలాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌కు పరామర్శ



రమణక్కపేటలో శ్రీరామ్‌ను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ, నాయకులు

కొత్తపల్లి: మండలంలోని రమణక్కపేటలో వైఎస్సార్ నేత కాజులూరి శ్రీరామ్ కుమారుడు ఇటీవల మృతి చెందాడు. కాగా గురువారం శ్రీరామ్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు పరామర్శించారు. జెడ్పీటీసీ గుబ్బల తులసీ కుమార్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ డివిజన్ సభ్యుడు బండి దావీదు, సర్పంచ్ రావి రమేష్ తదితరులు శ్రీరామ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. పొన్నాడ ఉప సర్పంచ్ కారే ఉదయ కిరణ్, ఆలమురి రాఘవ, నేరేళ్ల రెడ్డి, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సేవలే గుర్తింపు

ప్రత్తిపాడు: ఉద్యోగులకు సేవలే గుర్తింపును ఇస్తాయని, అవార్డులు బాధ్యతను మరింత పెంచుతాయని జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి అన్నారు. ప్రత్తిపాడు ఆర్‌సీఎం పాఠశాల ఆవరణలో గురువారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాజాన ధనలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ధనలక్ష్మి విశేష కృషి చేశారన్నారు. అనాథ, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు విద్యనందించడంతో ఆమె చొరవ మరువరానిదని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయిని ధనలక్ష్మిని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, ఉప సర్పంచ్ మదినే నూకరాజు, వార్డు సభ్యుడు తాతపూడి బుజ్జి, విశ్రాంత ఏఎస్సై ఎం.రాజారావు పాల్గొన్నారు.

ప్రతిభకు ఉపకారం

- ఎన్ఎంఎంఎస్‌తో పేద విద్యార్థులకు భరోసా
- దరఖాస్తులకు 15 వరకు గడువు
- ఎంపికైతే ఇంటర్ వరకు ఏడాదికి రూ.12వేల స్కాలర్‌షిప్



కాండ్రకోట ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

పెద్దాపురం: పేదరికం చదువుకు ఆటంకం కాకుడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నిరుపేద విద్యార్థులకు భరోసా కల్పిస్తోంది. ఎనిమిదో తరగతిలో డ్రాపౌట్స్ నివారించేందుకు ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)తో విద్యార్థులను ప్రోత్సహిస్తోంది. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు స్కాలర్ షిప్ అందిజేస్తోంది.

అర్హతలు ఇవే..

2023–24 విద్యా సంవత్సరంలో జెడ్పీ మోడల్, ఎయిడెడ్, మున్సిపల్ తదితర ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు అర్హత సాధిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల కుటుంబ వార్షికాదాయం రూ.3.5 లక్షలలోపు ఉండాలి. ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతూ ఏడో తరగతిలో జనరల్, బీసీ కులాలకు చెందిన వారైతే 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ కులానికి చెందిన వారు 50 శాతం మార్కులు సాధిస్తే పరీక్షకు అర్హులు. జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 15వ తేదీ దరఖాస్తులకు తుది గడువు.

డిసెంబర్ 3న పరీక్ష..

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 3న రాత పరీక్ష నిర్వహించనున్నారు. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో పరీక్ష ఉంటుంది. పరీక్ష రెండు విభాగాలుగా ఉంటుంది. ఒకటి మెంటల్ ఎబిలిటీ (ఎంఏటి) రెండోది అప్టిట్యూడ్ టెస్ట్ (ఎస్ఏటి) 6,7,8 తరగతి పాఠ్య పుస్తకాల్లోని సైన్స్, గణితం, సామాజిక అధ్యయనాల విభాగాల్లో 90 మార్కుల చొప్పున మొత్తం 180 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఇస్తారు. నియోజకవర్గంలో పెద్దాపురం, సామర్లకోట అర్బన్, రూరల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 1136 మంది విద్యార్థులు ఉన్నారు.

నిత్యం సాధన చేయాలి



కేవలం పరీక్షలు దగ్గర పడ్డాక చూద్దాం అని కాకుండా ఇప్పటి నుంచే ప్రతి రోజూ రెండు గంటల సమయం కేటాయించి చదువుకోవాలి. ఎక్కువగా అప్టిట్యూడ్‌పై దృష్టి సారించాలి. ఏటా మా పాఠశాల నుంచి విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక వుతున్నారు. వారిలో నేను ఉండడం చాలా సంతోషంగా ఉంది.

– రాజాల చక్రధర్, 9వ తరగతి, కాండ్రకోట, పెద్దాపురం

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఎక్కువ మంది ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్ పరీక్ష రాసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఏటా రూ.12వేల స్కాలర్‌షిప్ వస్తుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రభాకర శర్మ, ఎంఈఓ–1, పెద్దాపురం

చురుగ్గా ఓటర్ల జాబితా ఆన్‌లైన్ పనులు



పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో ఓటర్ల జాబితాను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

పిఠాపురం: గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన ఓటర్ల సర్వే పూర్తయ్యింది. కాగా ఓటర్ల జాబితా ఆన్‌లైన్ పనులు జోరుగా సాగుతున్నాయి. పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు, గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం మున్సిపల్ కార్యాలయాల్లో గత వారం రోజులుగా ఓటర్ల జాబితా ఆన్‌లైన్ పనులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 50 శాతానికి పైగా ఆన్‌లైన్ పనులు పూర్తవ్వగా మిగిలిన పనులు వేగవంతం చేశారు. కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం తహసీల్దార్లు ప్రసాద్, వెంకటేశ్వరరావు, త్రినాథ్‌తో పాటు పిఠాపురం మున్సిపల్ కమిషనర్ తదితరులు పనులను పర్యవేక్షిస్తున్నారు. వచ్చే వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించడంతో అధికారులు తమ సిబ్బందితో పనులను వేగవంతం చేశారు.

వైభవంగా గుబ్బాలమ్మ జాతర





ప్రత్యేక అలంకరణలో గుబ్బాలమ్మ అమ్మవారు, పైడిమల్లమ్మ అమ్మవారు

కిర్లంపూడి: రామకృష్ణాపురంలో గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయం పునఃనిర్మాణాన్ని పురస్కరించుకుని గురువారం అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక, పరసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా పైడిమల్లమ్మ జాతర

ఏలేశ్వరం: ఏలేశ్వరం గ్రామ దేవత పైడిమల్లమ్మ అమ్మవారి జాతర గురువారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జాతరలో స్థానిక కళాకారులతో గరగల నృత్యం, తాడేపల్లిగూడెం వారితో నవశక్తి వేషాలు, బిక్కవోలు వారితో బాణసంచా కాల్పులు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆలయ పూజారి అగ్నిగుండం తొక్కుతారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

కృష్ణా ముకుందా మురారీ



పిఠాపురంలో ఉట్టికొడుతున్న శ్రీకృష్ణ వేషధారి

- కన్నులపండువగా కృష్ణాష్టమి వేడుకలు
- వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు
- గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం పిఠాపురం, పెద్దాపురం నియోజక వర్గాల్లో ఘనంగా జరిగాయి. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉట్టిని కొట్టేందుకు యువత పోటీ పడ్డారు.



విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో చిన్నారులను ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి ఉమర్ ఆలీషా

పిఠాపురం: నియోజకవర్గంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను కన్నులపండువగా నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. పిఠాపురంలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పండితులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించగా వారికి పీఠాధిపతి ఉమర్ ఆలీషా ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. యండపల్లి, కొండెవరం గ్రామాల్లోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో మేళతాళాల నడుమ పల్లకీలో ఊరేగించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో భక్తులను ఆకట్టుకున్నాయి. గ్రామాల్లో ఉట్టి కొట్టు కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. ఆటపాటలతో చిన్నారులు అలరించారు. ఉప్పాడ బీచ్ రోడ్డులోని రామాలయం వద్ద శ్రీకృష్ణ ధర్మరక్ష సమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సామర్లకోటలో...

సామర్లకోట: కృష్ణాష్టమి వేడుకలను పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణ పరిధిలోని కృష్ణుని గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక విఘ్నేశ్వర థియేటర్ వద్ద వేంచేసి ఉన్న వేణుగోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, కౌన్సిలర్ నమ్మి దుర్గభవాని ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణుని గుడి వద్ద భక్తులు దేవతా మూర్తుల వేషధారణల్లో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ మేరకు ఎడ్లబండ్లపై వివిధ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య ఉత్సవం సాగింది. కోలసంబరం, వివిధ వేషధారణలతో సాగింది. కృష్ణుని గుడి నుంచి మఠంసెంటర్, స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్నవీధి, బళ్లమార్కెట్ సెంటర్, యార్లగడ్డవారి వీధి, రత్నంరాజు ఆస్పత్రి, మఠం సెంటర్, కొత్తూరు, అయోధ్యరామపురం, వీర్రాఘవపురం మీదుగా ఆలయం చేరింది. కౌన్సిలర్ నమ్మి సూర్య దుర్గ, ఆలయ కమిటీ నాయకులు నమ్మి శ్రీనివాసు, దారబాల సూరిబాబు, మార్ల సూర్యనారాయణ, మార్ల రాంబాబు, నమ్మి అప్పారావు భక్తులకు సేవలందించారు. పూరాతన విష్ణు ఆలయమైన మాండవ్యనారాయణ ఆలయంలోను బ్రౌన్‌పేట కృష్ణుని ఆలయంలోను ప్రత్యేక పూజలు చేశారు.



సామర్లకోట కృష్ణుని ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్న దవులూరి సుబ్బారావు తదితరులు



సామర్లకోటలో స్వామి వారి ఊరేగింపులో వివిధ దేవతామూర్తుల వేషధారణలతో ఎండ్ల బండ్లపై ప్రదర్శన



పిఠాపురంలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామికి ప్రత్యేక అలంకరణ

పార్టీ రహితంగా సంక్షేమం

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని వివరిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. ×గడప గడపకూ ప్రభుత్వం ₹లో భాగంగా గురువారం పెద్దాపురం పట్టణంలోని 9, 11 వార్డు పరిధిలో కొండయ్యపేట మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఆ వార్డు కౌన్సిలర్లు పెంటకోట సత్తిబాబు, బలుసు కనకం, సచివాలయ సిబ్బందితో కలసి సుమారు రెండున్నర గంటల పాటు పట్టణంలోని గడప గడపనూ సందర్శించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందుతున్న ప్రజా సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, ధర్మేంద్ర, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, నాగబోయిన రాజుబాబు, లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు, ఎంపీటీసీలు శైల గణేష్, రాయి వెంకటేశ్వరరావు, నల్లల గోవిందు, చింతా శ్రీనివాసరావు, జట్లా మోహన్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో 10న వేద పరిషత్

సామర్లకోట: ఏటా మాదిరిగానే ఈ నెల పదో తేదీన పంచారామ క్షేత్రమైన శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో 25వ వేద పరిషత్ నిర్వహిస్తున్నారు. పరిషత్తు కన్వీనర్ గ్రంధి సత్యరామకృష్ణ గురువారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. ఉమ్మడి జిల్లాల పరిధిలోని వేద పండితులతో వేద సభ నిర్వహించి, వారిని సత్కరిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లోక కల్యాణార్థం చతుర్వేద పారాయణ, వేద స్వస్తి జరుగుతాయని చెప్పారు. వేద సభకు భక్తులు హాజరు కావాలని కోరారు.

ఉదయ నిధి స్టాలిన్ వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన



పిఠాపురంలో ఆందోళన చేస్తున్న విశ్వహిందూపరిషత్, బజరంగ్ దళ్ సభ్యులు

పిఠాపురం: తమిళనాడు రాష్ట్ర మంత్రి ఉదయ నిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పిఠాపురంలో గురువారం విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పిఠాపురంలో నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ సభ్యులు ఉప్పాడ సెంటర్లో ఉదయ నిధి స్టాలిన్‌కి చెందిన సన్‌డైరెక్ట్ డిష్‌ను దహనం చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉదయ నిధి స్టాలిన్ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఉదయ నిధి స్టాలిన్‌పై కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ సభ్యులు సురేంద్ర దత్త, అరిగెల ప్రసాద్, ఎం.రమణ, రమణ, రవి కుమార్, సాధు సంతులు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యునికి ఆసరాగా ఆరోగ్యశ్రీ



ఆరోగ్యశ్రీతో కోలుకున్న సుబ్బారావు

కాకినాడ: నిరుపేదలు, అభాగ్యులను ఆదుకోవడంలో ఆరోగ్యశ్రీ ఎంతగానో తోడ్పడుతోంది. స్థానిక గాంధీనగర్ ప్రాంతానికి చెందిన రాజాపంతుల సుబ్బారావు చిన్న హోటల్‌లో పనిచేస్తూ ఒంటరిగా రోజులు వెళ్లదీస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం అస్వస్థతకు గురై రోడ్డుపై పడిపోవడంతో తుంటి ఎముక విరిగి నడవలేని పరిస్థితి ఏర్పడడంతో అక్కడి మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి కొందరి సాయంతో అతనిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎముకకు శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు చెప్పారు. అంత ఆర్థిక స్థోమత అతనికి లేకపోవడంతో సత్యవతి ఈ విషయాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి వివరించారు. ఈ మేరకు ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సుబ్బారావుకు ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు చేయించారు. దీంతో అతడికి అరుణ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేసి ఆసరాగా రూ.5 వేలు ఇచ్చి గురువారం డిశ్చార్జి చేశారు. ఈ మేరకు సుబ్బారావు ఎమ్మెల్యే ద్వారంపూడికి, అరుణ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ చవ్వాకుల శేషగిరిరావు, నీలకాయల శ్రీను, గోళ్ళ రమేష్‌లకు, గోడి సత్యవతికి ధన్యవాదాలు చెప్పారు.

మందు లేని వైద్యం.. నొప్పులు మాయం

- ఫిజియోథెరపీతో దీర్ఘకాలిక సమస్యలు దూరం
- మందులు, ఇంజెక్షన్లు లేకుండానే చికిత్స
- నేడు ఫిజియో థెరపీ దినోత్సవం



మోకాలినొప్పికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు

బోట్‌క్లబ్: ఎంతటి ధీరులైనా శారీరక అనారోగ్యానికి గురైనపుడు కొందరు చిన్న ఇంజెక్షన్‌కి భీరువులా మారిపోతారు. ట్యాబలెట్ వేసుకోవాలంటే నోట్లో ట్యాబ్‌లెట్ పడగానే ముఖం ముప్పై వంకర్లు తిప్పి ఆపసోపాలు పడుతూ మింగుతారు. మరికొందరు బయటకు కక్కేస్తారు. ఇంజెక్షన్ అన్నా, ట్యాబ్‌లెట్ వేసుకోవడం అన్నా చాలా ఇళ్లలో ఒక పెద్ద ప్రహసనంలా నడుస్తుంది. కానీ శరీరంలో ఏ భాగానికైనా బెణుకో, నరం మెలిక పడడమో, కీళ్లు జారిపోవడమో, పక్కకు మెలి పడడమో జరిగితే ఇంజెక్షన్, ట్యాబ్‌లెట్ అవసరం లేకుండా ఫిజియో థెరపీతో నొప్పి మాయం చేస్తూ సమస్యకు వైద్యం చేయవచ్చు. నేడు ఈ ప్రక్రియపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏదైనా గాయం వల్లో, వ్యాధి కారణంగానో శారీరక రుగ్మత, వైకల్యం ఎదురైతే దాని నివారణ, చికిత్స ద్వారా వైకల్యాన్ని నివారించి ఆరోగ్యవంతునిగా చేసే ప్రక్రియ ఫిజియో థెరపీ. శరీరం, శాశ్వత అనారోగ్యం, గాయంతో బాధపడుతుంటే దాని ప్రభావాన్ని తగ్గించడానికి ఫిజియో థెరపీకి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. ఈ ప్రక్రియ ఒక శారీరక చికిత్స మాత్రమే. ఎలాంటి మందుల ప్రమేయం లేని చికిత్స ఇది. శారీరకంగా వచ్చే నొప్పిని నివారించడానికి విద్యుత్ పరికరాలతో పాటు కండరాలు, కీళ్లు, నరాల సామర్థ్యాన్ని పెంచడానికి శారీరక కసరత్తుల ద్వారా చికిత్స చేస్తారు. వివిధ రకాల శస్త్ర చికిత్సల అనంతరం రోగుల జీవన విధానం మెరుగు పరచడంలో ఈ ఫిజియో థెరపీ పాత్ర కీలకం. రోగి ఎవరి మీదా ఆధారపడకుండా తన పనులు సొంతంగా చేసుకునేలా ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మునపటి ఉత్సాహంతో పాటు స్వీయ విశ్వాసాన్ని అందిస్తుంది.

సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్యం

మందులతో వచ్చే సైడ్ ఎఫెక్టులను గుర్తించిన ఎంతో మంది దేశ, విదేశాల్లో వైద్య నిపుణులు ఫిజియో థెరపీని ప్రోత్సహిస్తున్నారు. ఈ వైద్యం ద్వారా దీర్ఘకాలిక సమస్యలైన స్పాండిలైటిస్, ఫ్రోజెన్ షోల్డర్, టెన్నిస్ ఎల్బో తదితర ఇబ్బందులు నుంచి ఉపశమనం పొందవచ్చు. ఈ మధ్య కాలంలో యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఫోన్లు, కంప్యూటర్ల వాడడం వల్ల భుజాలు, మెడ, నడుం నొప్పులతో బాధ పడుతున్నారు. ఇటువంటి వారికి ఫిజియోథెరపీ వైద్యం ద్వారా ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా ఉపశమనం పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు.

వయసుతో సంబంధం లేని రుగ్మతలు



ఆధునిక జీవన విధానంలో వచ్చే ఇబ్బందులకు ఫిజియో థెరపీ ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా చిన్న వయస్సులో శారీరక రుగ్మతలు వస్తున్నాయి. వాటిని పరిష్కరించేందుకు ఫిజియో థెరపీ చాలా ఉపయోపడుతుంది.

– కె.కీర్తి, ప్రముఖ ఫిజియో థెరపీ నిపుణురాలు